పాక్ విమానాల నావిగేషన్ జామ్!

సరిహద్దుల్లో ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలను మోహరించిన భారత్

శ్రీనగర్: పాకిస్థాన్ సైనిక విమానాలు వాడే నావిగేషన్ వ్యవస్థలను స్తంభింపచేయడానికి భారత్ అత్యాధునిక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలను సరిహద్దుల్లో మోహరించింది. భారత జామింగ్ వ్యవస్థ యూఎస్, రష్యా, చైనాకు చెందిన జీపీఎస్, గ్లోనస్స్, బైదు నావిగేషన్ ప్లాట్‌ఫామ్‌లను నిరోధించే సామర్థ్యం కలిగి ఉంది. ఈ మూడు దేశాల నావిగేషన్ వ్యవస్థలను పాక్ సైన్యం వాడుతున్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పాక్ విమానాలు ఈ నెల 23 వరకు భారత గగనతలాన్ని వాడుకొనేందుకు అనుమతి లేదని కేంద్రం ప్రకటించిన వెంటనే జామింగ్ వ్యవస్థ ఏర్పాటు కావడం గమనార్హం.

రెండు రోజుల ముందే పహల్గాంలో పాగా

మూడు చోట్ల ముష్కరుల రెక్కీ

శ్రీనగర్: పహల్గాం మారణ కాండకు పాల్పడిన ఉగ్రవాదులు మరో మూడు పర్యాటక ప్రదేశాల్లోనూ రెక్కీ నిర్వహించారని ఎన్ఐఎ గురువారం వెల్లడించింది. అరు లోయ, ఒక అమ్యూజ్‌మెంట్ పార్క్, బెతాబ్ లోయను దాడి కోసం వారు పరిశీలించారని.. అయితే అక్కడ భద్రతా దళాల కాపలా ఉండటంతో బైసరన్ లోయను ఎంచుకున్నారని ఎన్ఐఎ తెలిపింది. పహల్గాం దాడి చేయడానికి రెండు రోజుల ముందే టెర్రరిస్టులు అక్కడకు చేరుకున్నారని వెల్లడించింది. వారికి నలుగురు నిరాయుధ టెర్రరిస్టులు(ఓవర్ గ్రౌండ్ వర్కర్స్) సహకారం అందించారని చెప్పింది. పహల్గాం కేసుకు సంబంధించి 20 మంది నిరాయుధ టెర్రరిస్టులను, 186 మంది అనుమానితులను ప్రశ్నించినట్టు తెలియజేసింది.

దక్షిణ కశ్మీర్‌లోనే పహల్గాం ఉగ్రవాదులు

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో దాడికి పాల్పడి 26 మంది ప్రాణాలు బలితీసుకున్న ఉగ్రవాదులు దక్షిణ కశ్మీర్‌లో తలదాచుకున్నట్టు జాతీయ దర్యాప్తు సంస్థ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ దాడి వెనుక మరి కొందరు ఉగ్రవాదుల ప్రమేయం కూడా ఉండొచ్చని అనుమానిస్తున్నారు. భద్రతా బలగాలు స్పందిస్తే.. వారికి రక్షణ కల్పిస్తూ కాల్పులు జరిపే ఉద్దేశంతో సమీపంలో మాటు వేసినట్టు ఉండొచ్చని భావిస్తున్నారు. ఆహారం, ఇతర నిత్యావసర సరుకుల కోసం ఎవరి అవసరం లేకుండా, బాహ్య ప్రపంచంపై ఆధారపడకుండా ఎక్కువ రోజులు ఉండగలిగేలా ముందే అన్నీ సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. దాడి సమయంలో ఉగ్రవాదులు సిమ్‌కార్డుతో పనిలేని అత్యంత సురక్షితమైన కమ్యూనికేషన్ వ్యవస్థను ఉపయోగించినట్టు తెలిసింది.

పీఓకేను స్వాధీనం చేసుకోండి

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్

హైదరాబాద్, మే 1: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్ ఉగ్రవాద కార్యకలాపాలకు ముగింపు పలకాలని, ఈసారి భారత్ కేవలం పాక్ భూభాగంలోకి ప్రవేశించి ముష్కరులను చంపడం మాత్రమే కాదని, అక్కడే తిష్ఠవేయాలని స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ మనదేనంటూ పార్లమెంట్ ఇప్పటికే తీర్మానం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ అలాంటప్పుడు ఈసారి దానిపై చర్య తీసుకోవాలని అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మీరు పాకిస్థాన్‌పై చర్య తీసుకోదలిస్తే మీరు అక్కడికి వెళ్లి ఆ స్థలాన్ని (పీఓకేను) స్వాధీనం చేసుకోండి అని పేర్కొన్న ఒవైసీ పాకిస్థాన్‌పై నిర్ణయాత్మక సైనిక, వ్యూహాత్మక చర్య తీసుకోవాలని, ఉగ్రవాదులు ఖాళీ చేసిన స్థావరాలను స్వాధీనం చేసుకోవాలని కేంద్రాన్ని కోరారు.

పాక్‌లో సైనిక తిరుగుబాటు?

- ఆర్మీ-ఐఎస్ఐ చేతికి అధికారం!
- డమ్మీగా మారిన ప్రధాని షెహబాజ్
- జాతీయ భద్రతా సలహాదారుగా ఐఎస్ఐ చీఫ్ మహమ్మద్ అసిమ్
- ఆర్మీ చీఫ్ మునీర్‌తో కలిసి చక్రం తిప్పుతున్న జనరల్



ఇస్లామాబాద్, మే 1: పాకిస్థాన్‌లో ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని పక్కకు నెట్టేశారా? భారత్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో విధాన నిర్ణయమంతా సైన్యం, ఇంటెలిజెన్స్ చేతుల్లోకి వెళ్లిపోయిందా అన్న అనుమానాలు గురువారం నాటి పరిణామాలతో వ్యక్తమవుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లో ఇప్పటికే పాక్షిక తిరుగుబాటు ప్రారంభమైంది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని డమ్మీగా మార్చినట్టు ప్రచారం జరుగుతున్నది. బలహీన ప్రధానిగా పేరు తెచ్చుకున్న షెహబాజ్ మొదటి నుంచి సైన్యం చెప్పుచేతల్లోనే ఉన్నారు. దానిలో భాగంగానే ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న మహమ్మద్ అసిమ్ మాలిక్ తాజాగా పాకిస్థాన్ జాతీయ రక్షణ సలహాదారునిగా నియమితులయ్యారు. ఆయన పాకిస్థాన్ 10వ ఎన్ఎస్ఏ కాగా, ఐఎస్ఐ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తికి ఈ పదవి ఇవ్వడం, ఒకేసారి రెండు ప్రధాన పదవులకు ఒకే వ్యక్తిని నియమించడం ఇదే తొలిసారి. మాలిక్ ఐఎస్ఐ డీజీగా 2024 అక్టోబర్‌లో నియమితులయ్యారు. పాకిస్థాన్‌లో 2022లో ఇమ్రాన్ ప్రభుత్వం దిగిపోయినప్పటి నుంచి ఎన్ఎస్ఏ పోస్టు ఖాళీగా ఉంది. తాజా నియామకంతో ఆర్మీ-ఐఎస్ఐ సంయుక్తంగా దేశంలో అధికారంపై పట్టు సాధించాయని భావిస్తున్నారు. కాగా, పాకిస్థాన్ ప్రజాస్వామ్య దేశమేనని నమ్మించడానికి ఇస్లామాబాద్ ప్రయత్నిస్తుండగా, అధికారం మాత్రం సైన్యం చేతిలో ఉందన్నది స్పష్టమవుతున్నది.

అడ్రస్ లేని షెహబాజ్..

గత కొన్ని రోజులుగా ప్రధాని షెహబాజ్ షరీఫ్ బహిరంగ కార్యక్రమాల్లో కన్పించకపోవడం, యుద్ధానికి సంబంధించిన కీలక ప్రకటనలు సైతం ఆయన నుంచి వెలువడకపోవడం చూస్తుంటే ముఖ్యమైన నిర్ణయాల్లో ఇప్పటికే ఆయనను పూర్తిగా పక్కన పెట్టేసినట్టు తెలుస్తోంది. పాకిస్థాన్‌లో విపక్ష నేత కూడా జైలులో ఉండటంతో ఇక అడిగే వారే లేకుండా పోయారు. దీంతో జాతీయ భద్రత, భారత్ చర్యలపై ప్రతిస్పందన ఇప్పుడు జనరల్ అసిఫ్ మునీర్, అసిమ్ మాలిక్‌ల చేతిలోకి వెళ్లిపోయిందని సమాచారం. వాస్తవానికి ఇది అధికార మార్పిడి కాదని పాకిస్థాన్ రాజకీయ పరిశీలకులు అంటున్నారు. చాలాకాలంగా తిరస్కరిస్తూ వస్తున్నప్పటికీ నిరంతరం పాటిస్తున్న వాస్తవ సైనిక పాలన అని వారు వ్యాఖ్యానిస్తున్నారు. అసలే పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం అంతంత మాత్రమని, ఇప్పుడు ఆ ముసుగు కూడా తొలగిపోయిందని వారు పేర్కొన్నారు. కాగా, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పాకిస్థాన్‌లో మిలిటరీ తిరుగుబాట్లు కొత్తేం కాదు. మొదటి నుంచి సైనిక వర్గాలే ఆధిపత్య పాత్రను పోషిస్తున్నాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వం నడిచినప్పుడు కూడా విదేశాంగ విధానం, అంతర్గత భద్రత, వ్యూహాత్మక నిర్ణయాల విషయంలో ఆర్మీ-ఐఎస్ఐలే విధాన నిర్ణయ శక్తులుగా వ్యవహరించి బ్యాక్ సీట్ డ్రైవింగ్ చేశాయి.

రాజస్థాన్ సరిహద్దుల్లో పాక్ బలగాల మోహరింపు

భారత్ తమ మీద దాడులు చేయొచ్చన్న భయంతో ఉన్న పాకిస్థాన్ సరిహద్దుల వద్ద తన బలగాల మోహరింపును ముమ్మరం చేసింది. మరోవైపు తన ప్రధాన యుద్ధ విమానాలతో ఏక కాలంలో సాధన మొదలు పెట్టింది. సైనికులకు శిక్షణ కూడా మొదలుపెట్టింది. విమానాశ్రయాల దగ్గర ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బందిని నియమించింది. రాజస్థాన్‌లోని లాంగెవాలా సెక్టార్ వద్ద పాక్ రాడార్ వ్యవస్థను, సైనిక, వైమానిక బలగాలను మోహరించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తన ఆర్మీ యూనిట్లను, నౌకా దళాన్ని భారత్ సరిహద్దుల వద్దకు పాక్ తరలిస్తున్నది.

కరాచీ, లాహోర్ గగనతలంపై పాక్ పాక్షిక ఆంక్షలు

భద్రతా కారణాల రీత్యా ఈ నెలంతా కరాచీ, లాహోర్ గగన తలాల వినియోగంపై పాక్ సర్కారు పాక్షికంగా ఆంక్షలు విధిస్తున్నట్టు ఓ మీడియా నివేదిక గురువారం వెల్లడించింది. భారత్-పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పాక్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. 'నిషేధిత గగనతలంపై ప్రతి రోజూ ఉదయం 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి' అని అధికారిక ప్రకటన పేర్కొంది. అయితే వాణిజ్య విమానాల రాకపోకలకు ఈ ఆంక్షలు వర్తించబోవని పౌర విమానయాన సంస్థ తెలిపింది. ఆంక్షల సమయంలో వాణిజ్య విమానాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లిస్తామని చెప్పింది.

తమ పౌరులకూ పాక్ నో ఎంట్రీ

- అటారీ-వాఘా సరిహద్దు వద్ద ప్రతిష్టంభన
- గడువు దాటినా స్వదేశానికి వెళ్లేందుకు పాకిస్థాన్ పౌరులకు భారత్ అనుమతి

న్యూఢిల్లీ: అటారీ-వాఘా సరిహద్దు వద్ద తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తాత్కాలిక వీసాపై ఉన్న పౌరులు తమ దేశాలకు వెళ్లిపోవాలంటూ రెండు దేశాలూ ఆదేశాలు జారీ చేయగా, దానికి డెడ్‌లైన్ కూడా ముగిసింది. అయితే ఈ సరిహద్దు వద్ద డజన్ల కొద్దీ పాకిస్థాన్ పౌరులు తమ దేశంలోకి వెళ్లేందుకు వేచి చూస్తుండగానే పాకిస్థాన్ గురువారం ఉదయం 8 గంటలకు తమ కౌంటర్లను మూసివేసింది. వారిని తమ దేశంలోకి అనుమతించబోమని పేర్కొంది. దీంతో డజన్ల కొద్దీ పాక్ పౌరులు ఆ సరిహద్దు వద్దనే నిలిచిపోయారు. దీంతో తాము అసలు ఏ దేశానికి చెందిన వారిమో తెలియక మహిళలు, వృద్ధులు, పిల్లలు తలదాచుకునే ప్రదేశం కూడా లేక, ఆకలితో అల్లాడారు. పాకిస్థాన్ చర్యపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. తమ సొంత పౌరులను దేశంలోకి రానీయకపోవడమేమిటని వారు మండిపడుతున్నారు. అయితే పాకిస్థాన్ వైఖరికి విరుద్ధంగా, భారత ప్రభుత్వం తదుపరి నోటీస్ జారీ చేసేవరకు అటారీ-వాఘా సరిహద్దు ద్వారా పాకిస్థాన్ పౌరులు స్వదేశానికి తిరిగి వెళ్లడానికి అంగీకరించింది.

హఫీజ్‌కు నాలుగింతల సెక్యూరిటీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారిగా భావిస్తున్న పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు పాకిస్థాన్ భద్రతను కట్టుదిట్టం చేసింది. పాక్ సాయుధ దళాలు అతడికి 24x7 భద్రతను కల్పిస్తున్నాయి. లాహోర్‌లోని సయీద్ నివాసం చుట్టూ నిఘాను పెంచాయి. లాహోర్‌లోని మొహల్లా జోహార్ పట్టణంలో అత్యంత రద్దీ ప్రాంతంలో హఫీజ్ సయీద్ నివాసం ఉంది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడి, అనంతర ఉద్రిక్తతల నేపథ్యంలో అతడి ఇంటి చుట్టూ పాక్ ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసింది. పాకిస్థాన్ సైన్యం, ఆ దేశ గూఢచార సంస్థ ఐఎస్ఐ, లష్కరే కలిసి సంయుక్తంగా అతడి భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. డ్రోన్లతోనూ పహరా కాస్తున్నారు. అతడి ఇంటికి నాలుగు కిలోమీటర్ల పరిధిలో అత్యంత శక్తిమంతమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సామాన్య ప్రజలు ఎవరినీ అటువైపు అనుమతించడం లేదు.

ఏ ఒక్కరినీ వదలం

పహల్గాం ఉగ్రవాదులందరినీ వేటాడుతాం: అమిత్‌షా

న్యూఢిల్లీ: దేశంలో ఉగ్రవాదుల ప్రతి చర్యకు తమ ప్రభుత్వం సరైన, కచ్చితమైన సమాధానం ఇస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హెచ్చరించారు. పహల్గాం దాడి అనంతరం ఆయన తొలిసారిగా గురువారం అస్సాంలో జరిగిన సభలో బహిరంగ వ్యాఖ్యలు చేశారు. 'ఎవరైనా తాము జరిపిన పిరికిపంద దాడే తమ విజయంగా భావిస్తే.. ఇది నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత్ దేశం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఏ ఒక్కరినీ వదలం. ప్రతి ఉగ్రవాదిని వేటాడి ప్రతీకారం తీర్చుకుంటాం' అని అన్నారు. దేశంలోని ఏ మూలలో ఉన్న ఉగ్రవాదాన్నయినా కూకటివేళ్లతో పెకలించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు.

భద్రతా దళాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తారా?

పహల్గాం ఘటనపై విచారణకు సుప్రీం నో

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణకు సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. ఈ కీలక సమయంలో దేశంలోని పౌరులంతా ఐకమత్యంగా ఉగ్రవాదంపై పోరాడాలని హితవు పలికింది. ఇటువంటి పిల్‌ను దాఖలు చేయడం ద్వారా మన భద్రతా బలగాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? అని నిలదీసింది. న్యాయ వ్యవస్థ పరిధిలోకి ఇటువంటి అంశాలను తీసుకురావద్దని స్పష్టం చేసింది. ఈ పిల్‌ను ఉపసంహరించుకోవడం మంచిదని సలహా ఇచ్చింది. రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి చేత దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారని.. దర్యాప్తు చేయడంలో వారు నిష్ణాతులు కాదని ధర్మాసనం చెప్పింది.

ప్రపంచం కోసం భారత్‌లో సృష్టించండి

కంటెంట్ క్రియేటర్లకు ప్రధాని మోదీ పిలుపు

ముంబై: ప్రజల జీవితాల్లో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తున్నదని ప్రధాని మోదీ గురువారం చెప్పారు. సంగీతం, నృత్యం, కథలు చెప్పడం వంటి కళా రూపాల ద్వారా మరింత కరుణరస పూరితమైన భవిష్యత్తును నిర్మించాలని కంటెంట్ క్రియేటర్లను కోరారు. మానవులు రోబోలుగా మారకూడదని చెప్పారు. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్(వేవ్స్) ప్రారంభం సందర్భంగా ఆయన ఈ పిలుపునిచ్చారు.

34 ఏండ్లు.. 57సార్లు బదిలీలు

- ఐఏఎస్ అధికారి ఖేమ్కా రిటైర్డ్
- అవినీతిపై రాజీలేని పోరాటం

న్యూఢిల్లీ, మే 1: అవినీతికి వ్యతిరేకంగా తిరుగులేని పోరాటం చేసిన ఐఏఎస్ అధికారిగా దేశవ్యాప్త గుర్తింపు పొందిన అశోక్ ఖేమ్కా ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ చేశారు. 34 ఏండ్ల తన సుదీర్ఘమైన కెరీర్‌లో ఎక్కడా.. ఎవరి వద్దా రాజీ పడకుండా పనిచేసినందుకు ఆయనకు దక్కిన బహుమతి 57 సార్లు బదిలీ ఉత్తర్వులు. పదే పదే ట్రాన్స్‌ఫర్లతో ఆయన దేశం యావత్తు వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. ప్రతి 6 నెలలకోసారి (సగటున) కొత్త పోస్టుకు అశోక్ ఖేమ్కాను బదిలీ చేశారు. ఆయన 1991 బ్యాచ్ హర్యానా క్యాడర్ అధికారి.

ఉగ్ర కుట్ర భగ్నం చేసిన బీఎస్ఎఫ్

అమృత్‌సర్‌లో ఆయుధాలు స్వాధీనం

న్యూఢిల్లీ, మే 1: అమృత్‌సర్‌లోని ఇండో-పాక్ సరిహద్దులో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కుట్రను భగ్నం చేశాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో, అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంబడి పంజాబ్ పోలీస్, బీఎస్ఎఫ్ జాయింట్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో.. భారోపాల్ అనే గ్రామానికి దగ్గర్లో అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఉగ్రవాదులు రహస్యంగా దాచిపెట్టిన మందుగుండు, తుపాకులు, గ్రనేడ్లు బయటపడ్డాయి. బుధవారం నాటి సెర్చ్ ఆపరేషన్‌లో రెండు హ్యాండ్ గ్రనేడ్లు, మూడు పిస్తోళ్లు, ఆరు మ్యాగజైన్లు, 50 రౌండ్ల బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నట్టు బీఎస్ఎఫ్ అధికారి ఒకరు చెప్పారు.

పాకిస్థాన్ ఎఫ్ఎంలలో భారతీయ పాటలు బంద్

లాహోర్, మే 1: పహల్గాం ఉగ్రదాడిపై భారత్ పలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో ప్రతీకార ఆంక్షలకు దిగిన పాకిస్థాన్ తాజాగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఎఫ్ఎం స్టేషన్లలో భారత్‌కు చెందిన పాటల ప్రసారాన్ని గురువారం నుంచి నిలిపివేసింది. లతా మంగేష్కర్, మహమ్మద్ రఫీ, కిశోర్‌కుమార్, ముకేశ్ లాంటి గాయకులను పాకిస్థానీయులు చాలామంది ఇష్టపడతారు. అందుకే వారు పాడిన పాటలను నిత్యం ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ప్రసారం చేస్తుంటాయి.

ఖైబర్ పఖ్తుంఖ్వాలో పాక్ ఎమర్జెన్సీ సైరన్లు

ఇస్లామాబాద్: భారత్ దాడులు చేస్తుందనే ఆందోళన పాకిస్థాన్‌లో తీవ్రమవుతున్నది. పాక్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ప్రభుత్వం 29 జిల్లాల్లో ఎమర్జెన్సీ అలర్ట్ సైరన్లను అమర్చడం ప్రారంభించింది. గగనతల దాడులపై ప్రజలను అప్రమత్తం చేయడం కోసం ఈ సైరన్‌లను మోగిస్తారు. ఆలస్యం చేయకుండా వీటిని అమర్చాలని, క్రమం తప్పకుండా ప్రోగ్రెస్ రిపోర్టులను సమర్పించాలని ఈ ప్రావిన్స్‌లోని అధికారులను సివిల్ డిఫెన్స్ ఆదేశించింది.

ఏడో రోజూ అదే తీరు

ఎల్వోసీ వెంబడి పాక్ కాల్పులు.. దీటుగా బదులిచ్చిన భారత్

జమ్ము: వరుసగా ఏడో రోజూ పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. నియంత్రణ రేఖ వెంబడి కాల్పులకు తెగబడింది. సరిహద్దుల్లోని మూడు జిల్లాల్లోని పలు సెక్టార్ల వద్ద రాత్రివేళ కాల్పులు జరిపింది. భారత సైన్యం ఇందుకు దీటుగా స్పందించిందని ఆర్మీ అధికారులు గురువారం తెలిపారు. ఇరు దేశాల సైనిక ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్స్ మంగళవారం హాట్‌లైన్‌లో కాల్పుల విరమణకు కట్టుబడి ఉండాలని చర్చించినా పాక్ దాన్ని ఉల్లంఘించింది. కుప్వారా, బారాముల్లా, ఉత్తర కశ్మీర్ జిల్లాల్లో చిన్న చిన్న ఆయుధాలతో పాక్ కాల్పులకు తెగ బడుతున్నది.

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఐఎస్ఐ కదలికలు

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్, మయన్మార్ సరిహద్దుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని నిఘా సంస్థలు, భద్రతా దళాలను ప్రభుత్వం ఆదేశించింది. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వ చర్యలు, బంగ్లాదేశ్‌లో పాకిస్థానీ సైనిక, ఐఎస్ఐ అధికారుల పర్యటనల నేపథ్యంలో హై అలర్ట్ ప్రకటించింది. బంగ్లాదేశ్ ప్రభుత్వంతో, అక్కడి రాడికల్ ఇస్లామిస్టు మూకలతో సంబంధాలను పటిష్టపరచుకోవడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తున్నది.

భారత్ అంటే పాక్‌కు భయమే

- యుద్ధం చేసే దమ్ము ఆ దేశానికి లేదు
- 1993లోనే అంచనా వేసిన సీఐఏ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ మధ్య యుద్ధం జరగవచ్చన్న ప్రచారం ప్రపంచవ్యాప్తంగా జోరందుకున్నది. ఈ నేపథ్యంలో అమెరికా గూఢచార సంస్థ సీఐఏ (సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ) నుంచి బయటబడిన ఓ రహస్య పత్రం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. భారత్ పట్ల పాకిస్థాన్‌కు లోలోపల ఉన్న భయాలను ఆ పత్రం వెల్లడించింది. 1993లో భారత్-పాక్ మధ్య నెలకొన్న పరిస్థితులను పరిశీలించి ఎన్ఐఈ (నేషనల్ ఇంటెలిజెన్స్ ఎస్టిమేట్) ఈ పత్రాన్ని రూపొందించింది. పైకి పాకిస్థాన్ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ భారత్ అంటే ఎంతో భయమని ఆ పత్రం స్పష్టం చేసింది. భారత్-పాక్ మధ్య యుద్ధం మొదలైతే అది కశ్మీర్ కారణంగానే జరుగుతుందని అంచనా వేసింది. ఒకవేళ యుద్ధం వచ్చినా భారత్‌కు పాక్ భయపడుతుందని తెలిపింది. ఆర్థికంగా, సైనికపరంగా పాకిస్థాన్ బలహీనంగా ఉండటమే ఇందుకు కారణమని పేర్కొన్నది. భారత్‌లో అల్లర్లు సృష్టించేందుకు ఉగ్రవాదులతో అనధికారిక పొత్తులు పెట్టుకోవడం లాంటి తప్పుడు పనులు చేయొచ్చని ఎన్ఈఐ పేర్కొన్నది.

పెండ్లిలో పెట్టిన బంగారం భార్యదే

- విడాకుల తర్వాత దానిని ఆమెకు భర్త ఇచ్చేయాలి
- కేరళ హైకోర్టు కీలక తీర్పు

కొచ్చి: వివాహ సమయంలో వధువుకు బహుమతిగా ఇచ్చిన బంగారం, నగదు ప్రత్యేకంగా ఆమెకు చెందిన ఆస్తులు అవుతాయని, అవి స్త్రీ ధనమని కేరళ హైకోర్టు తీర్పు చెప్పింది. ఇటువంటి ఆస్తులపై మహిళలకు చట్టబద్ధమైన హక్కు ఉందని పునరుద్ఘాటించింది. ఎర్నాకుళం, కలమసెరికి చెందిన మహిళ దాఖలు చేసిన అపీలుపై ఈ తీర్పునిచ్చింది. విడాకుల ప్రొసీడింగ్స్ నేపథ్యంలో ఆమె కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వివాహ సమయంలో తనకు లభించిన ఆస్తిని తిరిగి తనకు ఇప్పించాలని కోరారు. అందుకు ఫ్యామిలీ కోర్టు తిరస్కరించింది. దీనిపై ఆమె హైకోర్టులో అప్పీల్ చేశారు. హైకోర్టు తీర్పు చెప్తూ, ఇటువంటి విలువైన ఆస్తులను భర్త లేదా అతని తరపు బంధువులు దుర్వినియోగపరుస్తున్న సంఘటనలు చాలా ఉన్నాయని చెప్పింది. మహిళలు వాటిపై యాజమాన్య హక్కులను లేదా వాటిని తన వద్ద నుంచి అన్యాయంగా లాక్కున్నారని పత్రాల ఆధారంగా రుజువు చేయడం సాధ్యం కాదని తెలిపింది. ఇలాంటి సందర్భాల్లో న్యాయస్థానాలు ఏది జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయో పరిశీలించి న్యాయాన్ని అందజేయాలని చెప్పింది. ముఖ్యంగా, పెళ్లి బహుమతులు వ్యక్తిగత, దస్తావేజుల రహిత స్వభావం కలవి అని వివరించింది. ఇటువంటి సందర్భాల్లో స్పష్టమైన చట్టబద్ధత గల రుజువు కోసం పట్టుబట్టడం అవాస్తవికత అవుతుందని పేర్కొంది. తన తల్లిదండ్రులు ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్ముతో తనకు ఆభరణాలను కొన్నారని పిటిషనర్ ఆధారాలను చూపించారు.

వాణిజ్య సిలిండర్‌పై రూ.14.50 తగ్గింపు

న్యూఢిల్లీ: 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.14.50కు తగ్గించారు. తాజా తగ్గింపుతో వాణిజ్య సిలిండర్ ధర న్యూఢిల్లీలో రూ.1747.50గా ఉన్నది. గత రెండు వారాలుగా అంతర్జాతీయ చమురు ధరలు తగ్గాయి. ప్రపంచ వాణిజ్య యుద్ధం ఇంధన డిమాండ్ అంచనాలను దెబ్బ తీయడమే ఇందుకు కారణం. మరోవైపు విమాన ఇంధన(ఏటీఎఫ్) ధరను 4.4 శాతం తగ్గించారు. దీంతో న్యూఢిల్లీలో ఏటీఎఫ్ కిలోలీటర్ ధర రూ.3,954.38 తగ్గి రూ.85,486.80కు చేరింది.

జనన, మరణాల రికార్డులతో ఓటర్ జాబితా అనుసంధానం

ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, మే 1: దేశంలో ఓటర్ లిస్టులను మరింత పారదర్శకంగా ఉంచేందుకు భారత ఎన్నికల సంఘం నడుం బిగించింది. అందులో భాగంగా ఓటర్ లిస్టులను వేగంగా నవీకరించేందుకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి జనన, మరణాల జాబితాను ఎప్పటికప్పుడు ఎల్క్ట్రానిక్ రూపంలో తీసుకుని ఓటర్ లిస్టులతో అనుసంధానించనున్నట్టు ఈసీ తెలిపింది. దీని వల్ల నమోదైన మరణాల గురించి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌వోలు) సకాలంలో సమాచారాన్ని పొందుతారని, మరణించిన వారి బంధువుల అధికారిక అభ్యర్థన కోసం వేచి ఉండకుండా, బూత్ స్థాయి అధికారులు క్షేత్ర సందర్శనల ద్వారా సమాచారాన్ని తిరిగి ధ్రువీకరించడానికి వీలు కలుగుతుందని ఈసీ గురువారం తెలిపింది. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960, రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్స్ అండ్ డెత్స్ చట్టం, 1969 ప్రకారం ఎన్నికల సంఘానికి అలాంటి వివరాలు కోరే హక్కు ఉంది. అలాగే పౌరులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఓటర్ సమాచార స్లిప్‌ల డిజైన్‌ను మార్చాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. కొత్త డిజైన్‌లో ఓటర్ సీరియల్ నంబర్, పార్ట్ నంబర్‌లు మరింత స్పష్టంగా కన్పించేలా వాటి ఫాంట్ సైజ్‌ను పెంచుతారు.

అమెరికాలోనే కొవిడ్ వైరస్ పుట్టుక!

శ్వేతపత్రాన్ని విడుదల చేసిన చైనా

*బీజింగ్: కొవిడ్-19 వైరస్ పుట్టుకపై అమెరికా-చైనా పరస్పర ఆరోపణలకు దిగుతున్నాయి. కొవిడ్-19 వైరస్ తొలుత అమెరికాలోనే ఉద్భవించిందని చైనా తాజాగా ఎదురుదాడికి దిగింది. ఈ అంశంపై చైనా బుధవారం ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. వైరస్ పుట్టుక అమెరికాలోనే ఉందని, కానీ అమెరికా, అక్కడి ప్రభుత్వం సార్స్-కోవ్-2 మూలాల జాడపై సిగ్గు లేకుండా రాజకీయం చేస్తున్నాయని నివ